సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట లీగల్, జూన్ 4 : ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శనివారం జరుగనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి డి.మల్లయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లింగయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వామి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, జూన్ 4 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం నృసింహుడి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపంలో కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగిన మహిళ మృతి

హుజూర్‌నగర్, జూన్ 4 : పురుగుల మందు తాగి వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన గుజ్జుల ప్రశాంతి (32). నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది. పెండ్లి భర్తతో విభేదాలు తలెత్తడంతో తన కొడుకుతో నాలుగేండ్లుగా వేరుగా జీవిస్తున్నది. ఆరు నెలలుగా హుజూర్‌నగర్‌లోని బజాజ్ షోరూంలో ఉద్యోగం చేస్తున్నది. ఈ నెల 2న తనుంటున్న రూమ్‌లో గడ్డి మందు సేవించి స్నేహితులకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే స్పందించిన వారు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందింది. ప్రశాంతి తమ్ముడు మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. తను చదివిన నర్సింగ్ కోర్సుపై జాబ్ రాలేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం.

బంగారు ఆభరణాలు చోరీ

మేళ్లచెర్వు, జూన్ 4 : ఇంటి తాళం పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ ఘటన మేళ్లచెర్వు మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్యామల శ్రీనివాస్‌రెడ్డి తన భార్య, కూతురుతో కలిసి ఈ నెల 1న ఇంటికి తాళం వేసి షాపింగ్ కోసం హుజూర్‌నగర్ వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని రూ.90 వేల విలువ గల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వ తూముల షెటర్ల దొంగలు అరెస్ట్

నేరేడుచర్ల, జూన్ 4 : సాగునీటి కాల్వపైన ఏర్పాటు చేసిన తూముల వద్ద ఉన్న ఇనుప సామగ్రిని అపహరిస్తున్న ఇరువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ మంగళవారం తెలిపారు. నేరేడుచర్ల మండల పరిధిలోని జాన్‌పహాడ్ మేజర్ ఎన్ఎస్పీ కాల్వ మీద గల తూములకు ఏర్పాటు చేసిన గేట్ రాడ్, షటర్లు, గేర్ బాక్స్‌లు చోరీకి గురవుతున్నాయని కెనాల్ వర్క్ ఇన్స్‌పెక్టర్ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన వేముల రాజు, వేముల శ్రీకాంత్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

7న ఫణిగిరి సీతారామ చంద్రస్వామి ఆలయ భూముల కౌలుకు వేలం

నాగారం, జూన్ 4 : మండలంలోని ఫణిగిరి గ్రామంలో గల సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు ఈ నెల 7న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 2024-2025 సంవత్సరానికి గాను ఈ నెల 7న ఆలయ ఆవరణలో దేవాలయానికి చెందిన 105 ఎకరాలకు సంబంధించిన కౌలు కోసం వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే రైతులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

LOST

★ I, NANGUNOORI RADHA KRISHNA, S/o. Nangunoori Mallaiah, R/o. Etoor Village, Nagaram Mandal, Suryapet Dist., T.S. I have Lost My Original Secondary School Certificate with Register No. 0700586. If found anybody, please Contact: 9652342358.
NT-333520

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

పూర్తి వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	తొలుపులే : 9182777638

పచ్చిరొట్టతో ప్రయోజనాలెన్నో

● భూసారం పెంపు
● పెరుగనున్న పంటల దిగుబడి

మేళ్లచెర్వు, జూన్ 4 : అవగాహన లేమి, అధిక దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం చాలామంది రైతులు రసాయనిక ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడుతున్నారు. ఫలితంగా ఉత్పాదక వ్యయం గణనీయంగా పెరుగుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఏకైక ప్రత్యామ్నాయం సేంద్రియ ఎరువుల వినియోగం. పచ్చిరొట్ట పైర్లను వినియోగించుకుని భూసారాన్ని పెంచుకుని పెట్టుబడి తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్ట పైర్లను రెండు సమూహాలుగా వర్గీకరించవచ్చు.

1. పప్పుజాతికి చెందని పచ్చిరొట్ట పైర్లు : ఇవి నేలకు కేవలం సేంద్రియ పదార్థాన్ని మాత్రమే అందిస్తాయి. ఉదాహరణకు జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు మొక్కలు

2. పప్పు జాతికి చెందిన పచ్చిరొట్ట పైర్లు : నేలకు సేంద్రియ పదార్థాలతో పాటు నత్రజని లాంటి మూలకాన్ని కూడా నేలకు అందిస్తాయి. ఈ పప్పు జాతి పైర్లు వాటి బుడిపెల్లో రైజోబియం వంటి బ్యాక్టీరియా సహకారంతో గాలిలోని నత్రజనిని వాటి వేరు బుడిపెల్లో స్థిరీకరింపజేస్తాయి. ఉదాహరణకు జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర, అలసందలు

ఎప్పుడు విత్తాలి

– పిల్లిపెసర, పెసర లాంటి పచ్చిరొట్ట పైరును మే, జూన్‌లో తొలకరి వర్షాల సమయంలో హెక్టారుకు 40-45 కిలోలు విత్తనాలను చేనులో చల్లాలి. ఈ సమయంలో భాస్వరం వంటి ఎరువులు వేస్తే పప్పుజాతి రొట్ట పైర్లు అధిక ప్రయోజనాన్ని ఇస్తాయి

– సూపర్ పాస్ఫేట్ ఎరువును హెక్టారుకు 150 కిలోలు వేసుకోవాలి

జీలుగు పైరు

– పచ్చిరొట్టను నేలలో కలియదున్నే ముందు భాస్వరం ఎరువు వేసుకోవాలి

– పైరును 6-8 వారాల వయస్సులో నేలలోకి కలియదున్నాలి. అలాచేసేప్పుడు నేలలో తేమ ఉండాలి

– కలియదున్నాక 3-4 వారాలు మాగనివ్వాలి

ఇవీ ప్రయోజనాలు

– పచ్చిరొట్ట ఎరువు చివికిన తర్వాత రసాయనిక ప్రక్రియ పెరిగి భూమి సారవంతం అవుతుంది

– భూమి భౌతిక లక్షణాలు పెరిగి భూసారం పెరగడంతో వేరు బాగా పెరిగి భూమి గుల్లబారి తేమగాలి సరైన మోతాదులో మొక్కలకు అందుతాయి

– పచ్చిరొట్ట పైర్లు వరికన్నా నేల లోతైన భాగాల నుంచి పోషకాలను తీసుకుని వరి పైరుకు అందిస్తాయి

పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది

పచ్చిరొట్ట పైర్లు వేసుకోవడం ద్వారా భూసారం పెరిగి అధికోత్పత్తులు సమకూరుతాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో అందిస్తున్నాం. అవసరమున్న రైతులు వారం రోజుల్లో మండల వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించాలి.

– పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మేళ్లచెర్వు

బాలికా విద్యకు భరోసా కస్తూర్బా

● విద్యార్థినులకు నాణ్యమైన విద్య, భోజనం
● గుర్రంపోడ్‌లో 90 శాతం తగ్గకుండా ఉత్తీర్ణత
● ఈఏడాది 100 శాతం ఉత్తీర్ణతతో మండలంలో ప్రథమ స్థానం

గుర్రంపోడ్, జూన్ 4 : అనాథ, నిరుపేద బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా గాంధీ బాలిక (కేజీబీవీ) విద్యాలయాలు విశేష కృషి చేస్తున్నది. ఈ విద్యాలయంలో పనిచేసే సిబ్బంది విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బాలికలకు ఒత్తిడి లేని విద్యను అందించేందుకు వీలుగా ఆటపాటలతో,విజ్ఞానదాయక అంశాలపై దృష్టి సారించారు. ఆరోగ్యంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. చదువుల ఒత్తిడి లేకుండా విద్యార్థినులకు యోగాతో పాటు ఆటపాటలతో అభ్యసనం సాగించేలా ప్రణాళిక రూపొందించింది. ఈ చర్యలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులు ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

గుర్రంపోడ్ కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల

ఆంగ్ల మాధ్యమంలో బోధన

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్లమాధ్యమంలో బోధన ఆందుతున్నది. ఆయా పాఠశాలల్లోకస్తూర్బా పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై విద్యా శాఖ దృష్టి పెట్టింది. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 24 మంది పరీక్షలు రాయగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు. అంతేకాకుండా పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి 90 శాతంపైగా ఉత్తీర్ణత సాధిస్తూ వస్తున్నది.

నాణ్యమైన పదార్థాలతో మెనూ..

కేజీబీవీ విద్యార్థినులకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. కరోనా అనంతరం పున:ప్రారంభమైనా ఎప్పటికప్పుడు వసతి గృహంలో భోజన సౌకర్యం మెరుగుపర్చి, రోజుకో రకమైన పదార్థాలతో సరికొత్త రకమైన వంటకాలు విద్యార్థినులకు అందిస్తున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి ప్రీ బ్రేకు ఫాస్ట్, బ్రేక్ ఫాస్ట్, లంచ్, ఈవినింగ్ స్నాక్స్, డిన్నర్ తరువాత పండ్లు అందిస్తున్నారు. మాంసాహారం కూడా అందిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేశాం

కేజీబీవీల్లో చదివే విద్యార్థినిల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. నవంబర్ నుంచే స్టడీ అవర్స్ నిర్వహించాం.డిసెంబర్ లోగా సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం ఇచ్చిన కరదీపిక ఎంతగానో ఉపయోగపడింది.

– తరి రాములు,మండల విద్యాధికారి

మంచి ఫలితాలు సాధించాం

ముందస్తు ప్రణాళికలతో 10వ తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించాం. 10వ తరగతిలో 24 మంది విద్యార్థినులకు ప్రతి విద్యార్థినిని పాఠశాల ప్రారంభం నుంచి గమనిస్తూ విద్యార్థినిలు ఏ సబ్జెక్ట్‌లో వారు డల్‌గా ఉన్నారని గమనిస్తూ ఆ సబ్జెక్ట్‌లలో ప్రత్యేక దృష్టి సారించాం. 100 శాతం ఉత్తీర్ణతతో పాటు మండల టాపర్‌గా నిలిచాం.

–చేపూరి పుష్పలత, ప్రత్యేకాధికారి

కొనసాగుతున్న పాఠ్య పుస్తకాల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాశాఖ అందజేసే పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తక విభాగం నుంచి కొనసాగుతున్నది. మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ఎంఆర్‌సీలకు ప్రత్యేక వాహనాల్లో వాటిని సరఫరా చేశారు. ఇప్పటి వరకు అన్ని మండలాలకు 90శాతం పుస్తకాలను డీఈఓ భిక్షపతి ఆదేశాల మేరకు సరఫరా చేసినట్లు బుక్ డిపో మేనేజర్ వెంకటాచారి వెల్లడించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి వీటిని అన్ని పాఠశాలలకు సరఫరాచేయాలనేదే విద్యాశాఖ లక్ష్యమన్నారు.

–రామగిరి, జూన్ 4

లారీలో పుస్తకాలు నింపుతున్న హమాలీలు

మేళ్లచెర్వు : మేళ్లచెర్వులో విత్తన దుకాణంలో రశీదులు పరిశీలిస్తున్న డీసీఓ పద్మ

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

● డీసీఓ పద్మ

మేళ్లచెర్వు, జూన్ 4 : రైతులకు మేలు రకాల విత్తనాలు అందించడంతో పాటు వాటికి బిల్లులు తప్పక అందించాలని డీలర్లకు జిల్లా కో ఆపరేటివ్ అధికారి పద్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శంభిరెడ్డి, సీఈఓ వెంకట్ రెడ్డి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓలు అన్నపూర్ణ, దుర్గాభవానీ, వీరనాగరాజు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

నాగారం : తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సర్టిఫైడ్ వరి విత్తనాలు నాగారం గ్రామీణ అగ్రో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నాగారం ఎక్స్‌రోడ్‌లో ఉన్న సేల్ కౌంటర్‌లో అందుబాటులో ఉన్నాయని ఎఫ్‌పీసీ మేనేజింగ్ డైరెక్టర్ కొడవకంటి వెంకన్న తెలిపారు. బీపీటీ 5204 వరి సన్న రకం 25 కిలోల బ్యాగు ధర రూ.1,030, కేఎన్ఎం 1638 సన్నరకం 25 కిలోల బ్యాగు ధర రూ.1,030, దొడ్డు రకాలు ఎంటీయూ 1010 బ్యాగు పరిమానం 25 కిలోలు ధర రూ.988, కేఎన్ఎం 118 బ్యాగు 25 కిలోల ధర రూ.988కు లభిస్తున్నట్లు వెల్లడించారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9182305338, 9398502513 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు

చింతలపాలెం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి పి.శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్ తీసుకుని మండల వ్యవసాయ కార్యాలయంలో ఆన్‌లైన్ పర్మిట్ తీసుకుని ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో అందించి జీలుగు విత్తనాలు తీసుకోవాలన్నారు. 30 కేజీల బస్తా సబ్సిడీపై రూ.1,116కు లభిస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చివ్వెంల, జూన్ 4 : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటనల మండలంలోని బండమీది చందుపట్లలో మంగళవారం జరిగింది. బాధిత రైతు మారినేని సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మేతకు వెళ్లిన జెర్సీ ఆవులు తిమ్మాపురం రోడ్డు వైపు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తెగి ఉండడంతో ఓ ఆవు కాళ్లకు తీగలు తగలడంతో షాక్‌కు గురై చనిపోయినట్లు తెలిపారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు వెల్లడించాడు.

చందంపేట : కంకర తేలిన తెల్దేవర్‌పల్లికి వెళ్లే రహదారి

రోడ్డు ఇలా..ప్రయాణం ఎలా..!

● అధ్వానంగా కోరుట్ల బేస్ క్యాంప్- తెల్దేవర్‌పల్లి రోడ్డు
● ఇబ్బంది పడుతున్న వాహనదారులు ● అధికారులు స్పందించాలని విన్నపం

చందంపేట, జూన్ 4 : మండలంలోని కోరుట్ల బేస్ క్యాంప్ నుంచి తెల్దేవర్‌పల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు నిర్మాణం కోసం కంకర వేసిన తర్వాత వేర్వేరు కారణాలతో పనులు నిలిచిపోయాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 6 కిలో మీటర్ల మేర రోడ్డు పరిస్థితి ఇలాగా ఉండడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఐదు నెలల క్రితం రోడ్డు మరమ్మతులు నిధులు మంజూరు కావడంతో రోడ్డు ఏర్పాటుకు పనులు మొదలు పెట్టారు. కానీ పనులు ముందుకు సాగకపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా దేవరకొండ నుంచి కోరుట్ల, తెల్దేవర్‌పల్లి, పాత తెల్దేవర్‌పల్లి, మోత్యతండా, బొల్లారంపట్టి, దేవరచర్ల, యల్మమంద, చాపలగేటు, ఉస్మాన్‌కుంట, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులవలయం, సర్కిల్‌తండా, పొగిళ్ల గ్రామాలకు ఈ రోడ్డు గుండా ప్రయాణించాల్సి వస్తుంది. అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి, జూన్ 4 : నార్కట్‌పల్లి పట్టణంలో మంగళవారం విద్యుదాఘాతంతో వ్యక్తం మృతి చెందాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన జొర్రిగల శ్రీనివాస్(45) వృత్తిరీత్యా వెదురు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. పనిలో భాగంగా కటింగ్ మిషన్‌తో వెదు రు బొంగులను కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వైరు కాలుకు తాకి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.

కుటుంబ సభ్యులు 108 కు ఫోన్ చేయగా చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శ్రీనివాస్ భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే

● హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో నిలిచిన అభివృద్ధి
● రూ.56 కోట్లతో పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం
● ప్రస్తుతం నిధులు విడుదల కాక పనుల నిలిపివేత
● వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హాలియా, జూన్ 4 : హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.56 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులు సగం మేర పూర్తయ్యాయి. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రూ.56 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.56 కోట్లు కేటాయించగా 2022 మేలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాలియాలో రూ. 28 కోట్లతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు, డిజిటల్ లైబ్రరీ, ఆడిటోరియం, ఎడమ కాల్వ బండ్ సుందరీకరణ, మినీ స్టేడియం, చిల్డ్రన్స్ పార్క్ పనులు ప్రారంభమై శరవేగంగా జరిగాయి. ప్రస్తుతం ఆ పనులు 60శాతం వరకు పూర్తయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత నిధులు విడుదల చేయక పోవడంతో ప్రస్తుతం పనులు నిలిచి పోయాయి. దాంతో పాటు అంతర్గత రహదారుల కోసం గత ప్రభుత్వం హాలియా మున్సిపాలిటీకి రూ. 4 కోట్లను మంజూరు చేసింది. ఆ నిధులతో రోడ్ల నిర్మాణం ప్రారంభించగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఆ వైపు దృష్టి సారించడం లేదు. ఇంకా పలు వీధుల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉంది.

హాలియా మున్సిపాలిటీలో నిలిచిపోయిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణం

నందికొండ మున్సిపాలిటీలో

నందికొండ మున్సిపాలిటీలోనూ రూ. 28 కోట్లతో పలు అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు, ఆడిటోరియం, అంతర్గత రహదారులు, డిజిటల్ లైబ్రరీ, బస్టాండ్ ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీల్లో ప్రజలకు కావాల్సిన సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.28 కోట్లు కేటాయించింది. అభివృద్ధి పనులు కూడా ప్రారంభమై వేగంగా కొనసాగినై. ప్రభుత్వం మారిన తర్వాత మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైన అధికారులు, అధికార పార్టీ నేతలు స్పందించి పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి.

–చాపల సైదులు, హాలియా మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● టీపీడీఎంఏ రాష్ట్ర సలహాదారుడు నాగేందర్‌రెడ్డి

రామగిరి, జూన్ 4: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో చదివే విద్యార్థుల 2023-24 విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను ప్రభుత్వం విడుదల చేసి యాజమాన్యాలను ఆదుకోవాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల అసోసియేషన్(టీపీడీఎంఏ) రాష్ట్ర సలహాదారుడు, ఎంజీయూ అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 900 డిగ్రీ, 1,350 జూనియర్ కళాశాలల యాజమన్యాల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం 8 వేల కోట్లు బకాయిలున్నాయని వీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. అప్పులు చేసి కళాశాలల నిర్వహణ చేయలేక మూసివేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరం పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి కళాశాలల యాజమన్యాలు వాటిలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందిని అదుకోవాలని కోరారు.